# రెచ్చిపోతున్న హ్యాకర్స్

**-డేటా చోరీ చేసి ..ఆపై బ్లాక్‌మెయిల్**
**-నగరంలో కలకలం రేపుతున్న వరుస ఘటనలు**
**-హ్యాక్ గురవుతున్న ఫేస్‌బుక్, ట్విటర్, ఇన్‌స్ట్రాగ్రాం అకౌంట్లు**
**-ప్రభుత్వ, ప్రైవేట్ వెబ్‌సైట్‌లను సైతం హ్యాక్ చేస్తున్న నేరగాళ్లు**
**-ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న సైబర్ క్రైం పోలీసులు**



**హైదరాబాద్, నవంబర్ 14,ప్రభాతవార్త:** ఫేక్‌బుక్, ట్విటర్, ఇన్‌స్ట్రాగ్రామ్ అకౌంట్లను హ్యాక్‌చేస్తూ వ్యక్తిగత వివరాలు చోరీ చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు నగరంలో రెచ్చిపోతున్నారు. వివిధ అకౌంట్ల ద్వారా ఆకర్షణీయమైన ఫోటోలతో నకిలీ యుఆర్ఎల్‌ను పంపిస్తున్నారు. సదరు యుఆర్ఎల్‌ను క్లిక్‌చేస్తే వెంటనే ఆయా ఖాతాలను పూర్తిగా తమన ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఆతర్వాత పాస్‌వార్డ్ మార్చేసి అందులో ఫోటోలను సేకరించి బ్లాక్‌మెయిల్‌లకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా సైబర్‌నేరాలపై అవగాహన లేని అనేక మంది ఈనేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుంటున్నారు. ముఖ్యంగా ఫేస్‌బుక్, ట్విటర్, ఖాతాకు లాక్ వేయని వారు మాత్రమే సైబర్ నేరగాళ్లకు సులువుగా దొరుకుతున్నారు. ఒకసారి ఖాతా హ్యాక్ అయితే ఫోన్‌లోని సమాచారంతోపాటు, వాట్సాప్ కాంటాక్ట్ లిస్ట్, ఫోన్ కాంటాక్ట్ లిస్ట్ గ్యాలరీలోని కుటుంబసభ్యులతో సహా హ్యాకర్ల చేతికి వెళ్ళిపోతాయి. అసభ్య కరమైన ఫోటోలను ఖాతాలో పోస్టు చేయడం, మీరు అడినట్లే బంధువులు, స్నేహితులకు మెసేజ్‌ల ద్వారా డబ్బులు అప్పుగా అడటం వంటివి చేస్తున్నారు. విషయం తెలుసుకులేని కొందరు ఖాతాదారులు హ్యాకర్లకు లొంగిపోతున్న సంఘటలను వెలుగు చూస్తున్నాయి.

**వాటర్ బోర్డు వెబ్‌సైట్ సైతం ...**

ఇటీవల మహానగర నీటి సరఫరా, మురుగునీటి పారుదల బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి) అధికారిక వెబ్‌సైట్ గుర్తు తెలియని వ్యక్తులు హ్యాక్ చేశారు. వెబ్‌సైట్ హ్యాక్ చేసిన కేటుగాళ్లు టెక్నాలజీ సాయంతో నగర వాసులను బెట్టింగ్, ఆన్లైన్ రమ్మీ, కాసినోల వైపు మళ్లించారు. ఈ వ్యవహారం హైదరాబాద్ వాసుల్లో గందరగోళం సృష్టిస్తోంది.

హైదరాబాద్ ప్రజలు వాటర్ బిల్లులు చెల్లించడానికి వాటర్‌బోర్డు వెబ్‌సైట్‌ను ఉపయోగిస్తుంటారు. ఎప్పటిలానే కొందరు తమ నీటి బిల్లులు చెల్లించడానికి వెబ్సైట్ ఓపెన్ చేసే ప్రయత్నం చేయగా.. ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. హ్యాక్ చేసిన ఆగంతకులు అనుమానాస్పద లింక్స్ గూగుల్ న్యూస్‌లో ప్రత్యక్షమయ్యేలా చేశారు. దీంతో వినియోగదాలను ఆన్లైన్ బెట్టింగ్ గేమ్స్ వైపు మళ్లించాయి.

**మెట్రోరైల్‌ను వదల్లేదు..**

కొద్దిరోజుల క్రితం హ్యాకర్లు హైదరాబాద్ మెట్రో రైల్ అధికారిక ఎక్స్ అకౌంట్‌ను కూడా హ్యాక్ చేశారు. ఇందులో భాగంగా సైబర్ కేటుగాళ్లు మెట్రో రైల్ అకౌంట్ హ్యాక్ అయిందని, ఏకంగా ఆసంస్థ అఫీషియల్ అకౌంట్లో ట్వీట్ చేశారు. వెంటనే అప్రమత్తమైన టెక్నికల్ టీమ్ హుటాహుటిన హైదరాబాద్ మెట్రో రైల్ ఎక్స్ ఖాతా అకౌంట్‌ను తిరిగి పునరుద్ధరించారు.

**పోలీసుల ప్రత్యేక దృష్టి..**

ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని హ్యాకర్లు రెచ్చిపోతుండడంతో సైబర్ పోలీసులు రంగంలోకి దిగారు. హ్యాకింగ్‌కు పాల్పడుతున్న వారిని గుర్తించే పనిలో పోలీసులు పడ్డారు. గతంలో, ప్రస్తుతం హ్యాకింగ్ చేస్తుండడంతో దీన్ని పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. హ్యాకర్ల ఆటకట్టించేందుకు ఐపీ అడ్రస్‌లు కనుక్కునే పనిలో పడ్డారు. అయితే హ్యాకింగ్ సరదాకు చేస్తున్నారా? లేదా వారి వెనుక ఎవరైనా అసాంఘిక శక్తులు ఉన్నారా అని ఆరా తీస్తున్నారు. పటిష్ట భద్రత కలిగే వారి ఖాతాలే హ్యాక్ అవుతుండడంతో పోలీసులను కలవరపరుస్తోంది. త్వరలోనే నిందితులను పట్టుకుని హ్యాకర్ల ఆట పట్టిస్తామని సైబర్ పోలీసులు చెబుతున్నారు.



# హైదరాబాద్ వార్త

# దేశానికే దిక్సూచి సమగ్ర కుటుంబ సర్వే

**-బంజారాహిల్స్‌లో స్వయంగా పాల్గొన్న మంత్రి పొన్నం , మేయర్‌లు..**



**పంజగుట్ట, నవంబర్ 14 ప్రభాతవార్త :** తెలంగాణా ప్రజల యొక్క స్థితిగతులు, భవిష్యత్ ప్రభుత్వ ప్రణాళిక ద్వారా మంచిమార్పు తీసుకువచ్చి ఆదర్శవంతమైన తెలంగాణాగా రాష్ట్ర ప్రజలను భాగస్వాములను చేసుకుని ఇంటింటి కుటుంబ సర్వే జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం బంజారాహిల్స్, ఎన్బీటీ నగర్‌లో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలసి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే తెలంగాణా దేశానికి దిక్సూచిగా ఉండే విధంగా జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 30 శాతం సర్వే పూర్తయిందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 4 లక్షల 50 వేలకు పైగా ఇళ్ళకు సర్వే జరుగుతుందన్నారు. ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నారన్నారు. ఇక్కడ ఇన్యుమరేటర్స్ అడిగితే 150 ఇళ్ళకు కేటాయించగా ఇప్పటివరకు 26 ఇళ్ళు పూర్తి చేశారని తెలిపారు. ఈ సర్వే వల్ల ఎలాంటి పథకాలు కట్ కావని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానని తెలిపారు. దీనివల్ల ఎలాంటి అనుమానాలకు తావులేదని, సమాచారం గోప్యంగా ఉంటుందన్నారు. దీనిని ప్రజలకు ఉపయోగపడేవిధంగా మార్గదర్శకత్వం చేయడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి స్పందించే విధంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. క్యాబినెట్ తీర్మానం తర్వాత అసెంబ్లీలో కూడాతీర్మానం పెట్టటం జరుగుతుందన్నారు. గతంలో సర్వే చేయాలని అనేక దీక్షలు, ధర్నాలు చేసిన వారు సైలెంట్‌గా ఉన్నారని మిగతావారు అందరూ స్వాగతిస్తున్నారన్నారు. బ్యాంక్ అకౌంట్ డీటైల్స్ అడగడంలేదని, కేవలం ఉందా లేదా అని మాత్రమే అడగడం జరుగుతుందన్నారు. ఆధార్ కార్డు కూడా తప్పనిసరికాదన్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమం ద్వారా ప్రజలకు న్యాయం జరుగుతుందని, అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఎన్యుమరేటర్స్ కు ఎక్కడైనా ఇబ్బంది ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు. సోషల్ మీడియాలో కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని, వారిపై కూడా చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. ఈ సమాచారం ఆధారంగా ఏ వర్గాలకైతే అన్యాయం జరిగిందో తెలుసుకుని వారికి న్యాయం చేయడానికి ప్రభుత్వం పూనుకుందని ఆయన వివరించారు. సర్వేలో భాగంగా స్వయంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మహ్మద్ నయీం కుటుంబానికి సంబందధించిన వివరాలను నమోదు చేశారు.

# ఎడాపెడా మందులు

**-ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మందులను రాస్తున్న కొందరు వైద్యులు -6కాంబినేషన్‌లో రెండు మూడు రకాల మందుల వల్ల సైడ్ ఎఫెక్ట్స్**

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త** వైద్యులపై విశ్వాసంతో రోగులు వారి వద్దకు వెళుతుంటారు. చిన్నా చితకా అనారోగ్య సమస్యల్ని సైతం వారికి చెప్పుకుంటారు. కానీ కొందరు డాక్టర్ల అవగాహన రాహిత్యం రోగుల పాలిట శాపంగా మారుతోంది. అవసరం లేకున్నా ఎడాపెడా మందులు రాస్తున్నారని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) పరిశోధనలోనూ వెలుగు చూసింది. పేరెన్నికగన్న ఆసుపత్రులు మొదలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో డాక్టర్లు రాస్తున్న ప్రిస్క్రిప్షన్లలో నిబంధనల అతిక్రమణ జరుగుతున్నట్లు పరిశోధన తేల్చింది.

**పీజీ విద్యార్థుల నుంచి అనుభవజ్ఞుల వరకు..**

వైద్యులు రాసిన ప్రిస్క్రిప్షన్ల ఏ మేరకు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయన్న దానిపై ఐసీఎంఆర్ పరిశోధన చేసింది. మొత్తం 4,838 ప్రిస్క్రిప్షన్లను అధ్యయనం చేసింది. ఇందులో 55శాతం ప్రిస్క్రిప్షన్లు మాత్రమే నిబంధనల మేరకు ఉన్నాయని, 45శాతం ప్రిస్క్రిప్షన్లలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని నిర్ధారించింది. 9.8శాతం ప్రిస్క్రిప్షన్లలో పూర్తిగా నిబంధనల ఉల్లంఘన జరిగిందని స్పష్టం చేసింది. జనరల్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, సైకియాట్రీ, ఆర్థో, ఛాతీ, డెంటల్, సూపర్ స్పెషాలిటీలకు చెందిన అన్ని విభాగాల్లో డాక్టర్లు రాసిన ప్రిస్క్రిప్షన్లలో నిబంధనల అతిక్రమణ జరుగుతోంది. ఐసీఎంఆర్ అధ్యయనం చేసిన ప్రిస్క్రిప్షన్లు రాసిన వారిలో పీజీ విద్యార్థులు మొదలు నాలుగు నుంచి 18ఏళ్ల అనుభవం ఉన్న వైద్యులు కూడా ఉన్నారు. పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రిస్క్రిప్షన్లలో సగటున నాలుగు మందులు అనవసరంగా రాసినట్లు పరిశోధనలో గుర్తించారు.

**జలుబుకు ఇన్ని మందులా..!**

సాధారణ జలుబుకు కూడా డాక్టర్లు ఇష్టారాజ్యంగా మందులు రాసేస్తున్నారు. ఐసీఎంఆర్ నివేదిక ప్రకారం.. జలుబు, తేలికపాటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు సంబంధించి మాంటిలూకాస్ట్'+లివోసిట్రిజిన్, పారాసిటమాల్, డెక్స్ట్రోమితార్ఫాన్, రాబిప్రజోల్+డోమ్‌పెరిడోన్ మందులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి. వీటిని అనవసరంగా రాస్తున్నారు. ఈ రెండు నిషేధిత జాబితాలో కూడా ఉన్నాయి. వీటి వల్ల ఖర్చు పెరుగుతుంది. పైగా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, బీ పీ, షుగర్, మలేరియా, కీళ్ల నొప్పులు, మైగ్రెయిన్, కడుపులో మంట, అజీర్తి, పిప్పిపళ్లు, చెవిపోటు, టీబీ, పోస్ట్ కోవిడ్‌కు సంబంధించిన జబ్బుల్లో అత్యధికంగా నిబంధనల అతిక్రమణ జరగుతోంది. అజిత్రో మైసిన్, ర్యాంటిడిన్, ట్రిప్సిన్ వంటవి కూడా ఎక్కువగా దుర్వినియోగం అవుతున్నాయి. ప్రిస్క్రిప్షన్లలో వీటిని ఎడాపెడా రాసేస్తున్నారు. చెవికి, శ్వాసకోశానికి ఒకేరకమైన మందులువాడుతున్నారు.



**నొప్పి మందులతో పాటు ఆసిడిటీ మందులు ఎందుకు ?**

నొప్పి మందుల వల్ల అసిడిటీ వచ్చే అవకాశం ఉంది. అయితే ఎసిడిటీ రిస్క్ ఉన్న వారికే ఆయా మందులు రాయాలి. కానీ అందరికీ రాస్తున్నారు. దీనివల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయి. తేలికపాటి ఆహారం తీసుకుంటే సరిపోయే వారికి కూడా అసిడిటీ మందులు రాస్తున్నారు. అసిడిటికి సంబంధించి పాంటోప్రాజోల్, రాబిప్రజోల్+డోంపెరిడోన్ అనే మందులు అత్యంత దుర్వినియోగానికి గురవుతున్నాయి. 21.9శాతం ప్రిస్క్రిప్షన్లు అనవసరంగా రాసినట్లు నిర్ధారించారు.

**రియాక్షన్లు.. దుష్ప్రభావాలు**

కీళ్లనొప్పులకు రాస్తున్న సెరాసోపెప్టిడేజ్ అనే మందు పనిచేస్తుందో లేదో స్పష్టత లేదని ఐసీఎంఆర్ తేల్చింది. కర్ణభేరి ఇన్ఫెక్షన్లకు వాడే సెఫిక్జిమ్ మెడిసన్ మొదటి ప్రాధాన్యం మందుకాదు. కానీ అధికంగా వాడేస్తున్నారు. బీపీ, శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల మందులను అనవసరంగా రాస్తున్నారు. ఇవి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి. ఆయా మందులు వాడటం వల్ల మందుల ఖర్చు పెరుగుతుంది. డ్రగ్ రియాక్షన్లకు కారణమవుతున్నాయి. కాంబినేషన్‌లో రెండు మూడు మందులు రాయడం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తుంటాయి.

**డోసులు ఎక్కువ తక్కువ!**

నిబంధనల అతిక్రమణలో మందులు అధికంగా, అనవసరంగా రాయడమే కాదు.. డోసులు తక్కువ లేదా ఎక్కువ ఉండటం కూడా జరుగుతోంది. మందులు ఎన్నిరోజులు వాడాలి, రోజుకు ఎన్నిసార్లు వాడాలన్న దానిపైనా ప్రిస్క్రిప్షన్లు సరిగా ఉండట్లేదు. ఫార్ములేషన్‌లో తప్పులు జరుగుతున్నట్లు నిర్ధారించారు. డయాబెటిక్ మందులు, హార్మోన్ మందులు, రక్తాన్ని పలుచన చేసే మందులు ఎక్కువగా దుర్వినియోగం అవుతున్నాయి. బీపీ, షుగర్, ఫిట్స్ రోగాలకు వాడే మందుల్లో సరైన కాలపరిమితిపై స్పష్టత ఇవ్వడంలేదు.

**డాక్టర్లకు అవగాహన కల్పించాలి..**

ప్రజలు వైద్యం కోసం పెట్టే ఖర్చులో 40శాతం మందులకే వెచ్చిస్తున్నారు. మందుల వినియోగం శాస్త్రీయంగా జరగాలి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 344 మందుల కాంబినేషన్లను నిషేధిత జాబితాలో చేర్చింది. వీటిపై డాక్టర్లకు పూర్తి అవగాహన కల్పించాలి. ఐసీఎంఆర్ తీసుకువచ్చిన స్టాండర్డ్ ట్రీట్‌మెంట్ గైడ్‌లెన్స్ కేవలం వెబ్‌సైట్‌కే పరిమితం అవుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ నిబంధనలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి.

**- డాక్టర్ రంగయ్య**

# అధికారులపై దాడిని ఉపేక్షించొద్దు..

**-లగచర్ల ఘటనకు నిరసనగా హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ధర్నా..**



**హైదరాబాద్, నవంబర్ 14,ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా, దుద్యాల మండలం, లగచర్ల లో అధికారులపై జరిగిన దాడి ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగుల ఐకాస చైర్మన్ వి.లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనుక ఎవరున్నా, ఎంతవారైనా ఉపేక్షించొద్దని కోరారు. లగచర్ల ఘటనకు నిరసనగా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు గురువారం రాష్ట్ర వ్యాప్తం గా అన్ని కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగుల ఐకాస చైర్మన్ వి.లచ్చిరెడ్డి హాజరై ప్రసంగించారు. ఉద్యోగులపై దాడికి పాల్పడి, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల మాన సిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు కుట్రపన్నిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల కోసం పని చేసే అధికారులను లక్ష్యంగా చేసుకొని దాడి చేయడంలో కుట్ర కోణం దాగి ఉంటుందని ఆరోపించారు. ఇప్పటికే పోలీసుల విచారణలో వెలుగులోకి వస్తున్న విషయాలు ఉద్యోగ లోకాన్ని భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. రాజకీయాలకు అతీతంగా సేవలు అందించే అధికారులపై దాడులు, హత్యాయత్నం వంటి ఘటనలకు పూనుకోవడం వెనుకాల బలమైన కుట్ర దాగి ఉందనే అనుమానాలకు బలం చేకూరుతుందన్నారు. లగచర్ల ఘటనలో దాడికి గురైన ఉద్యోగులపై కాకుండా, దాడికి పాల్పడిన వారిని పరామర్శించ డాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది సరైన పద్ధతి కాదని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం హైదరాబాద్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ నాయకులు కె. రామకృష్ణ, జనరల్ సెక్రటరీ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, ఎస్. రాములు, అధ్యక్షులు తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్, డా.జి. నిర్మల, అధ్యక్షులు తెలంగాణ ఉద్యోగుల అసోసియేషన్, దర్శన్‌గౌడ్, అధ్య క్షులు తెలంగాణ సీపీఎస్ యూనియన్, డా. కత్తి జనార్దన్, దేవికా, శ్రీరాం, హరికిషన్ , ఉదర గోపాల్ , విజయారావు, సుగంధిని, హేమ లత, రాబర్ట్ బ్రూస్, రోహిత్ నాయక్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# సెక్రటేరియట్ వెనకాల కూలిన భారీ వృక్షం

**-వ్యక్తికి గాయాలు**

**హైదరాబాద్, నవంబర్ 14,ప్రభాతవార్త:** డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం వెనుక భాగంలోని మింట్ కాంపౌండ్‌లో ఓ భారీ వృక్షంకూలింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్ ముందు ఒక్కసారిగా అటువైపుగా వెళ్తున్న ఆటోపై కూలింది. ఈ ప్రమాదంలో ఒకరు గాయపడగా స్థానికులు హాస్పిటల్‌కు తరలించారు. కాగా ప్రమాద సమయంలో వెహికిల్స్ రాక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వృక్షాన్ని తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

**ఉరేసుకొని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య**

**నార్సింగి, నవంబర్ 14 ప్రభాతవార్త :** డిగ్రీ విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... భద్రాద్రి జిల్లా కొత్తగూడెంకు చెందిన శ్రీజ(20) హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుంది. ఈమె రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం హైదర్షాకోట్‌లో ఉంటున్న తన అక్క ఇంట్లో ఉంటూ రోజూ కళాశాలకు వెళ్తుంది. ఎప్పటిలాగే గురువారం ఉదయం తన అక్క ఇంటి నుంచి కళాశాలకు వెళ్లింది. మధ్యలో తన అక్కకు ఫోన్‌చేసి ఇంటికి వస్తున్నాను, ఇంటి తాళం పక్కింట్లో ఇచ్చి వెళ్లాలని సూచించింది. అక్క అలాగే చేసింది. మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చిన శ్రీజ తాళం తెరుచుకొని ఇంట్లోకి వెళ్లింది. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన అక్క తలుపు కొడితే ఎంతకీ తెరువలేదు. కిటికీ తలుపులు తెరిచి చూడగా ఉరేసుకొని కనిపించింది. పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. విద్యార్థిని మృతికి కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు వివరించారు.

**నాంపల్లిలో కారు బీభత్సం..13మందికి గాయాలు**

**హైదరాబాద్,నవంబరు 14 ప్రభాతవార్త :** నాంపల్లిలో కారు బీభత్సం సృష్టించింది. అధిక వేగంతో దూసుకొచ్చిన కారు అదుపుతప్పి జనాలపైకి దూసుకెళ్లింది. దీంతో పలువురు గాయపడ్డారు. దీంతో కారును నడుపుతున్న వ్యక్తి మద్యం మత్తులో ఉన్నాడని గుర్తించిన స్థానికులు అతడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన కథనం ప్రకారం..గురువారం తెల్లవారుజామున నాంపల్లిలోని రెడ్‌హిల్స్ నీలోఫర్ కేఫ్ వద్ద ఓ కారు అదుపుతప్పి జనాలపైకి దూసుకెళ్లింది. దీంతో పలు వాహనాలు, 13 మందికీ గాయాలయ్యాయి. కారు డ్రైవర్‌ను పట్టుకున్న స్థానికులు.. అతడు మద్యం మత్తులో ఉన్నాడని గుర్తించి చితక్కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు

# 23న జిల్లా కలెక్టరేట్‌లో "బీసీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ

**-ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పబ్లిక్ హియరింగ్**
**-అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి వెల్లడి**



కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడతున్న అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి

**హైదరాబాద్, నవంబర్ 14,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల రిజర్వేషన్లపై ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల నుండి అభ్యర్థులను స్వీకరించేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలోని సభ్యుల బృందం ఈనెల 23న హైదరాబాద్ కలెక్టరేట్ లో ప్రజాభి ప్రాయ సేకరణ జరుపనుందని అదనపు కలెక్టర్ రెవెన్యూ ముకుంద రెడ్డి తెలిపారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో బిసి కమిషన్ పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ముకుందరెడ్డి మాట్లాడుతూ 23న జరిగే పబ్లిక్ హియరింగ్‌కు అన్ని ఏర్పా ట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బీసీల అభ్యున్నతి, జీవన స్థితిగతులు, ప్రయోజనాలపై సూచనలు, అభ్యంతరాలు స్వీకరణ కార్యక్రమంలో కులసంఘాల నుండి దరఖాస్తులు స్వీకరించబడుతాయని ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలని అధికారులకు అయన సూచించారు. అదే విదంగా ఆర్డీఓలు, తహసీల్దార్లు కూడా తమ తమ పరిధిలో ముందస్తుగా ప్రెస్ మీట్స్ నిర్వహించాలని అయన సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వెంకటాచారి, ఆర్డీఓలు హైదరాబాద్ రామకృష్ణ, సికింద్రాబాద్ సాయిరామ్, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఆశన్న, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్, జి హెచ్ ఎం సి అధికారులు తదితరులు పాల్గొన్నారు



## వ్యాయామం, సమతుల్య ఆహారంతో మధుమేహం నియంత్రణ : డాక్టర్.నాగేందర్ రెడ్డి



ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్. నాగేందర్ రెడ్డి

**వనస్థలిపురం. నవంబర్.14.ప్రభాతవా :** ప్రపంచ మధుమేహ దినోత్సవం నవంబర్ 14 సందర్భంగా వనస్థలిపురం లోని శ్రీకృష్ణ డయాబెటిస్ ఎండోక్రైన్ సెంటర్ లో ఉచితంగా షుగర్, బి.పి.,ఫూట్ కేర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్.నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్14 న ప్రజలకు మధుమేహ అవగాహన సదస్సు ను నిర్వహిస్తూ,ఉచితంగా షుగర్,బి.పి. వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం,30 నుండి 40 నిమిషాలు నడక,యోగా నియమాలు పాటిస్తే మధుమేహం అదుపులో ఉంటుందన్నారు. చక్కెర,నూనె తక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం,మద్యపానం, ధూమపానాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్,హారిక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సరూర్‌నగర్ ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ చౌరస్తాను పరిశీలించిన జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్


సరూర్ నగర్ పాత పోస్ట్ ఆఫీస్ చౌరస్తాను పరిశీలిస్తున్న జేడీసి. హేమంత్ పాటిల్

**హుడా కాంప్లెక్, నవంబరు 14 ప్రభాతవార్త :** నివాసితులు , ప్రయాణికులకు సురక్షితమైన వాతావరణాన్ని అందించేలా ఇరుకు రోడ్డుని విస్తరణ చేయాలని స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అభ్యర్థన మేరకు గురువారం జీ ఎచ్ ఎంసీ జొనల్ కమిషనర్ హేమంత పాటిల్ , సరూర్ నగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుజాత సరూర్‌నగర్ పాత పోస్టాఫీసు చౌరస్తాను అధికారులలో కలిసి పరిశీలించారు. పరిశీలించిన అనంతరం టౌన్ ప్లానింగ్ ఎ సి పి ప్రతాప్, ఇంజినీరింగ్ టీం ఈఇ శ్రీనివాసులకు 100 అడుగుల రోడ్డు విస్తరణ అంచనా వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లింగోజిగూడ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి సరూర్‌నగర్‌లోని పాత నివాసితులు, శానిటేషన్ డి ఇ. చందన, సిబ్బంది పాల్గొన్నారు.

## మల్కాజ్గిరి అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజిగిరి నవంబరు14,ప్రభాతవార్త :** ఎన్నికల సమయంలో మల్కాజ్గిరి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడమే తమ లక్ష్యమని మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మిర్జాల్ గూడా లో 17 లక్షల రూపాయల వ్యయంతో రూపొందించిన సిసి రోడ్డు నిర్మాణం పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ తో కలిసి గురువారం ప్రారంభించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్కాజ్గిరి నియోజకవర్గ అభివృద్ధి పార్టీలకు ప్రాంతాలకు అతీతంగా చేసి చూపిస్తానన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మేకల రాము యాదవ్ జిహెచ్ఎంసి ఏఈ దివ్య జ్యోతి మహిళా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## న్యూ గడ్డిఅన్నరంలోని దర్గాలో నేడు ఉర్సు ఉత్సవాలు

**మలక్ పేట ,నవంబర్ 14, ప్రభాతవార్త :** దిల్ షుక్ నగర్ న్యూ గడ్డిఅన్నారంలోని హజరత్ ఖాజా బంధ అలీషా చిస్తి రహమతుల్లా దర్గాలో శుక్రవారం నుంచి ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు షేక్ అబ్దుల్ కరీం చిస్తి ఆల్ ఖాద్రీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ప్రార్థన అనంతరం హజరత్ షేక్ అబ్దుల్ కరీం చిస్తి నివాసం నుంచి గంధం ఊరేగింపు కార్యక్రమం ప్రారంభమై వివిధ ప్రాంతాల గుండా దర్గా కు చేరుకోవడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా శనివారం నాడు దీపాలంకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

**నేడు డయల్ యువర్ డిఎం కార్యక్రమం: డిపో మేనేజర్ సమత**

మలక్ పేట ,నవంబర్ 14, ప్రభాతవార్త : దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని ఈనెల 15వ తేదీ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సమత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు, ఫిర్యాదులను తమకు తెలియజేయాలని పేర్కొన్నారు. సెల్ నెంబర్ 9959226137లో సంప్రదించాలని కోరారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఆమె తెలిపారు.

## ఘనంగా దేవాలయ ముఖ:ద్వార శంకుస్థాపన



దేవాలయ ముఖద్వార శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న నల్ల రఘుమారెడ్డి

**సైదాబాద్, నవంబరు 14 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీ భవాని నాగలింగేశ్వర స్వామి దేవాలయ ముఖ ద్వార శంకుస్థాపనను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.లక్ష్మయ్య, ప్రశాంత్, పురుషోత్తం, గౌతం రెడ్డి, నిషికాంత్‌రెడ్డి, బాలకృష్ణ, రాజశేఖర్‌రెడ్డి, జగదీష్‌గౌడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కార్పొరేటర్ క్రీడా వస్తువుల అందజేత

**సరూర్‌నగర్, నవంబర్ 14 ప్రభాతవార్త:** బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని మీర్‌పేట్‌లోని సిర్లాహిల్స్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆడుకోవడానికి కార్పొరేషన్ 45వ డివిజన్ కార్పొరేటర్ అక్కి మాధవి ఈశ్వర్‌గౌడ్ క్రీడా వస్తువులను విరాళంగా అందజేశారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె చదరంగం, క్యారం బోర్డు, షటిల్ బ్యాట్, వాలీ బాల్, క్రికెట్ కిట్ తదితర క్రీడా వస్తువులను అందజేశారు.

## విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి : ప్రిన్సిపల్ శ్రీధర్..


క్రీడల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీధర్..

**నేరెడ్‌మెట్,నవంబర్14,ప్రభాతవార్త:** విద్యార్థులు చిన్న వయస్సు నుండే విద్యతో పాటు ఇతర రంగాల్లో రాణించాలని ప్రొబెల్స్ గార్డెన్ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీధర్ అన్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన పలు క్రీడల పోటీలను పరిశీలించి అందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యను కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. విద్యార్థులకు సాంస్కృతిక, క్రీడల పోటీలను నిర్వహించి వారిలోని ప్రతిభను వెలికితీయాలన్నారు. క్రీడల్లో పాల్గొన్ని ప్రతిభ కనబర్చిన దివ్యాంక యాదవ్‌ను ఆయన అభినందించి బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**హెల్లెన్ కిల్లర్ సంస్థల ఆధ్వర్యంలో...** బాలల దినోత్సవం సందర్భంగా రామక్రిష్ణపురంలోని హెల్లెన్ కిల్లర్ విద్యా సంస్థలు, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ లయన్ పఠాన్ ఉమ్మర్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బధిర విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకునే విధంగా తాము కృషి చేయాలని అధ్యాపకులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షులు లయన్ వెంకట్ రావు, సెక్రటరీ లయన్ జాజుల అంజయ్య, లయన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

**వినాయక్‌నగర్ డివిజన్‌లో..** మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని లల్వాని నగర్ స్మార్ట్ కిడ్స్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం వేసే ప్రతి అడుగు మన పిల్లలకు మార్గదర్శకం అయ్యే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, కాలనీ వాసులు ఉమాకాంత్, ఓం ప్రకాష్, సాయిసురేష్, శ్రీకాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అవగాహన కోసమే జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు : చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించి ప్రసంగిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 14 ప్రభాతవార్త:** గ్రంథాలయాలు, పుస్తకాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించే సదుద్దేశ్యంతోనే ప్రతి సంవత్సరం నవంబర్ 14 నుండి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను దేశ వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ దావూద్‌ఖాన్‌గూడలోని రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ భవనంలో గురువారం 57వ జాతీయ గ్రంథాల వారోత్సవాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి స్థానిక కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డితో పాటు పలువురితో కలిసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రథమ ప్రధాని నెహ్రూ పుట్టిన రోజు నవంబర్ 14 నుండి మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ జన్మదినం నవంబర్ 19 వరకు దేశవ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారని వివరించారు. ఇందులో భాగంగా అన్ని వర్గాల ప్రజలకు, విద్యార్థులకు గ్రంథాలయల పట్ల, విజ్ఞానాన్ని అందించే పుస్తకాల పట్ల అవగాహన కలిపించే ఉద్దేశ్యంతో జరిగే ఈ వారోత్సవాలను రంగారెడ్డి జిల్లాలో విజయవంతం చేయాలని ఆయన కోరారు.మేధావులు,విద్యావంతులు,విద్యార్థులు,ప్రజలు గ్రంథాలయ వారోత్సవాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

**గ్రంథాలయ సేవలు సద్వినియోగం చేసుకోవాలి: మేయర్ పారిజాత**

మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయం బడంగ్‌పేట్‌లో ఉండడం సంతోషకరమని అన్నారు. గ్రంథాలయ సేవలను ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు హాజరయ్యే వారు గ్రంథాలయాలను ఉపయోగించుకొని ఉద్యోగాలు సంపాదించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి మనోజ్‌కుమార్, సిబ్బందితో పాటు నాయకులు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఒక సిసి కెమెరా 100 మంది పోలీసులతో సమానం : చింతల


కార్యక్రమంలో పాల్గొన్న అరుణసురేందర్‌యాదవ్

**ఎల్.బి.నగర్, నవంబర్ 14 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ రాక్ టౌన్ రాజీవ్ గాంధీ ఉన్నత పాఠశాలలో కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ సొంత నిధులతో నూతన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమంకి ముఖ్య అతిథిలుగా ఎల్బీనగర్ ఏసీబీ కృష్ణయ్యతో కలిసి కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీస్ సిబ్బందితో సమానమన్నారు.యువత అసాంఘిక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయికి అలవాటు పడి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వినోద్ కుమార్, ఎస్సై ప్రసాద్, రాక్ టౌన్ కాలనీ ప్రెసిడెంట్ వినోద్ రెడ్డి, సిద్దాల ఐలయ్య, పాల్వాయి సంజీవ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హబ్సిగూడలో సమగ్ర సర్వే పరిశీలించిన అధికారులు


హబ్సిగూడలో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న ప్రభుత్వ కార్యదర్శి ప్రియాంక, డిసి అంజనేయులు తదితరులు

**ఉప్పల్; నవంబరు 14 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్‌లో సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని గురువారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సహాయ కార్యదర్శి ప్రియాంక చెక్క, డిసి అంజనేయులు, ఇతర అధికారులు పరిశీలించారు. ఈ మేరకు హబ్సిగూడలో గాంధీ గిరిజనబస్తీలో సర్వే జరుగుతున్న విధానాన్ని ఆమె పరిశీలించి తగు సూచనలు చేశారు. సర్వేలో ఎటువంటి తప్పులు లేకుండా చేయాలని, ప్రజల నుంచి సమాచారం సేకరించి అధికారులకు అందించాలని సూచించారు. సర్వే త్వరగా పూర్తి చేసి కంప్యూటరీకరణ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

**సహకార రంగంతో విప్లవాత్మక మార్పులు : సింగిరెడ్డి పెంటారెడ్డి**

**సరూర్‌నగర్, నవంబర్ 14 ప్రభాతవార్త:** సహకార రంగంతో దేశంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని రంగారెడ్డి-హైదరాబాద్ జిల్లాల డిసిసిబి మాజీ ఛైర్మన్, బాలాపూర్ బండ్లగూడ ఖాల్సా సింగిల్ విండో మాజీ ఛైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి స్పష్టం చేశారు. బాలాపూర్‌లోని సొసైటీలో గురువారం ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎర్ర జైహింద్‌కుమార్ ఆధ్వర్యంలో 71వ జాతీయ సహకార వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఛైర్మన్ పెంటారెడ్డి సొసైటీ భవనంపై సహకార జెండాను ఎగురవేసి అభివాదం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సహకార రంగం వల్ల అన్నదాతల సంక్షేమం జరుగుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కొలన్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు అన్ను శ్రీనివాస్‌రెడ్డి, నీరుడు నరసమ్మ, పన్నాల గోపాల్‌రెడ్డి, సిబ్బంది పగుడాల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మధుమేహంపై అవగాహన పెంచుకోవాలి : రాదా



సదస్సులో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, నవంబర్ 14 ప్రభాతవార్త:** మధుమేహంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని ఆర్కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్బీ నగర్ అల్కాపురి రైట్ నక్షత్ర హాస్పిటల్‌లో వరల్డ్ మధుమోహాండే సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజువారి వ్యాయామం ఆరోగ్యకరమైన జీవనశైలితోనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటామ న్నారు. మారుతున్న కాలానుగుణంగా ప్రతిఒక్కరు ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ వహించాలన్నారు. ఈ సందర్భంగా 200 మంది రోగులకు ఉచితంగా రక్త పరీక్షలు, షుగర్, హెచ్‌బిఏ 1 వంటి పరీక్షలు నిర్వహించారు.కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఉషారాణి, రైట్‌నక్షత్ర హాస్పిటల్ వైద్యులు శివరామ కృష్ణ,ఉజ్వల్,వంశీ చంద్రరాజు,శిరీష,మహబూబ్‌బాషా,చంద్రప్రకాష్,నవ్య, సాయినాథ్, రాజకుమార్, దీవెన, ఝాన్సీ, హర్ష , ఉష పాల్గొన్నారు.

## నాదర్‌గుల్‌లో జాతీయ సహకార వారోత్సవాలు


సహకార జెండాను ఎగురవేసిన ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 14 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్ గ్రామంలో గురువారం 71వ జాతీయ సహకార వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలోని కుర్మల్‌గూడ రహదారిలోనున్న భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం కార్యాలయం ఆవరణలో సంఘం కార్యదర్శి పిండి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సొసైటీ ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి సహకార జెండాను ఎగురవేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులు సహకార గీతాన్ని ఆలపించారు.కార్యక్రమంలో సొసైటీ వైస్ ఛైర్మన్ బంగారు బాబు, మాజీ ఛైర్మన్, డైరెక్టర్ పెత్తుల్ల పుల్లారెడ్డి, డైరెక్టర్ తోట ప్రతాప్‌రెడ్డి, రైతులు మర్రి వెంకటరామకృష్ణారెడ్డి, సొసైటీ సిబ్బంది సువర్ణ, కరుణాకర్, బాలరాజ్, రజనీకాంత్ పాల్గొన్నారు.

**బిక్షపతిచారికి విశ్వబ్రాహ్మణ లీడర్-2024 అవార్డు**

**సరూర్‌నగర్, నవంబర్ 14 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 27వ డివిజన్ కార్పొరేటర్, సీనియర్ బిజెపి నేత పసునూరి బిక్షపతిచారికి విశ్వబ్రాహ్మణ లీడర్-2024 అవార్డు లభించింది. విశ్వ బ్రాహ్మణ సమాజానికి ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 416వ జయంతి సందర్భంగా ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన విశ్వ బ్రాహ్మణ లీడర్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయనను ఎంపిలు ఈటెల రాజేందర్, డాక్టర్ మల్లు రవి, జాతీయ బిసి కమీషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, తెలంగాణ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారిల చేతుల మీదుగా ఆయనను సన్మానించి అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బిసి కులాల ఛైర్మన్, విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం గౌరవాధ్యక్షుడు కుందరాము గణేష్ చారి, అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచారి పాల్గొన్నారు.

**మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు**

**ఉప్పల్; నవంబరు 14 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామం లో గురువారం నటరాజ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో బాల పురస్కార్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి నృత్యాంజలి కల్చరల్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి రవికుమార్, డాన్స్ అకాడమీ అధ్యక్షుడు ఎం.మౌనిక నర్సింగ్‌రావు, ఎం.కుమారస్వామి,పి.రాజు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా తరంగిణి నృత్యానికేతన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు.

## ఘనంగా శ్రీ ఉమమహేశ్వర స్వామికి లక్ష్మి పత్రి పూజ


శివునికి మహా హారతి ఇస్తున్న పూజారులు

**హుడా కాంప్లెక్, నవంబరు 14 ప్రభాతవార్త:** సరూర్ నగర్ డివిజన్ లోని వెంకటేశ్వర కాలనీ, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో 40వ బ్రహ్మోస్తవాల సందర్భంగా గురువారం ఉమామహేశ్వర స్వామి వారికి లక్ష పత్రి పూజ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. దేవాలయ ఆవరణ శివ నామ స్మరణ తో మారుమ్రోగింది. అనంతరం భక్తులు స్వామి వారి ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరుపోలు భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతి ప్రసాద్, మాజీ చైర్మన్ గందు ధనం రెడ్డి, కమిటీ సభ్యులు బోగేశ్వర్ రావు, సుబ్బ రావు, శ్రీమన్నారాయణ, శ్రీనివాస్ రావు, ప్రతాప్ రెడ్డి, మహేందర్, ఆలయ సభ్యులు రవీందర్ రావు, వీరేందర్ రెడ్డి, రాజశేకర్, భక్తులు పాల్గొన్నారు.

## పోర్టల్స్ సమస్యల పరిష్కారాన్ని కృషి : మారుతి


పోర్టల్స్ తో సమావేశమైన అధ్యక్షుడు మారుతీ తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 14, ప్రభాతవార్త :** రాష్ట్ర ఆర్టీసీ లో విధులు నిర్వహిస్తున్న పోర్టల్స్ సమస్యలను తెలుసుకుని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఆర్టీసీ పోర్టల్స్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు కే. మారుతి పేర్కొన్నారు. ఆర్టీసీ కార్గో, పార్సిల్ , లాజిస్టిక్స్ విభాగంలో పనిచేస్తున్న పోర్టల్స్ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రాష్ట్ర పర్యటన కార్యక్రమంలో భాగంగా ఖమ్మం బస్టాండ్ లో ఆయన పర్యటించి కార్గో పార్సిల్, లాజిస్టిక్స్ లో పనిచేస్తున్న పోర్టల్స్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గో పోర్టల్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమని తెలిపారు . ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, శ్రీనివాసరావు ,ఆర్. శ్రీనివాస్, అభిరామ్ ,మోహన్ ,గణేష్ ,శ్రీ సాయి ,రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**టిపిసిసి అధ్యక్షుడిని కలిసిన కోట్ల శ్రీనివాస్**

**సైదాబాద్, నవంబరు 14 ప్రభాతవార్త:** హైద్రాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన కోట్ల శ్రీనివాస్ గురువారం టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మార్కెట్ల అభివృద్ధితో పాటు రైతుల సంక్షేమానికి తీసుకోవాల్సిన నిర్ణయాల గురించి వివరించారు. ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చే విధంగా రైతులకు, వ్యాపారస్తులకు అనుసంధాన కర్తలుగా ఉండి విజయవంతంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసిన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్, మస్రత్ సుల్తానా, రామారావులు ఉన్నారు.

## దేశానికి దశ దిశ చూపిన మహనీయుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ


కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి దీపదాస్ మున్షి

**సైదాబాద్, నవంబరు 14 ప్రభాతవార్త:** భారతదేశ తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి దీపదాస్ మున్షి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు హాజరై చాచా నెహ్రూ చిత్ర పటం వద్ద ఘనంగా నివాళులర్పించి అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1923లో అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ మొట్టమొదటి అధ్యక్షుడిగా చాచా నెహ్రూ పనిచేశారని, దేశానికి దశ దిశ చూపిన మహనీయుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని అన్నారు. పంచవర్ష ప్రణాళికలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప నాయకుడిని కొనియాడారు. బాక్రానంగల్ నుంచి నాగార్జున సాగర్ వరకు అనేక ప్రాజెక్టులను నిర్మించిన ఘనత నెహ్రూకు, కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## శాంతినికేతన్ విద్యాసంస్థలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు


విద్యార్థులతో ఛైర్మన్ రాధాకృష్ణ, డైరెక్టర్లు, ఇంఛార్జీలు

**హయత్‌నగర్, నవంబరు 14 ప్రభాతవార్త:** భారత మొట్టమొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ జయంతిని పురస్కరించుకుని హయత్‌నగర్‌లోని శాంతి నికేతన్ విద్యాసంస్థలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల ఛైర్మన్ జి.రాధాకృష్ణ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలను ప్రారంభించి విద్యార్థులకు మిఠాయిలను పంపిణి చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని, వారే జాతి సంపదగా అభివర్ణించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి వారు నిర్ధేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అనంతరం ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు ఝాన్సీ, శేషారావు, జోనల్ ఇంఛార్జ్ సుధీర్, డీన్ ఫణిశ్రీ ప్రభంజన, ఏజీఎంలు రంగా శ్రీనివాసరావు, ధనుంజయ పాల్గొన్నారు.

## కులగణన పేరుతో వ్యక్తిగత సమాచార సేకరణకు తాము వ్యతిరేఖం : సీపీఐ


విలేకరులతో మాట్లాడుతున్న రవీంద్రాచారి

**హయత్‌నగర్, నవంబరు 14 ప్రభాతవార్త:** కులగణన పేరుతో వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని సేకరించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి అన్నారు. గురువారం ఆయన పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ రావినారాయణరెడ్డికాలనీ ఫేజ్-3లో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్ధానాల మేరకు కులగణన చేయటాన్ని తాము స్వాగతిస్తున్నా... దానిపేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా స్థిరాస్తుల వివరాలు, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడం సరికాదన్నారు. భూపోరాట కేంద్రం రావినారాయణరెడ్డి కాలనీ ఫేజ్-3లో నివాసముంటున్న పేద ప్రజల వివరాలను కూడా సర్వేలో పొందుపరుచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ పాల్గొన్నారు.

**గ్రంథాలయ పుస్తకాలతో జీవిత నిర్మాణం చేసుకోవచ్చు**

**హయత్‌నగర్, నవంబరు 14 ప్రభాతవార్త:** హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు, పండిట్ నెహ్రూ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన, వకృత్వ పోటీలను నిర్వహించారు. కళాశాల వైస్‌ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రంథపాలకుడు డా.దుర్గాప్రసాద్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రంథాలయంలోని పుస్తక వనరులను వినియోగించుకుని జీవిత నిర్మాణం చేసుకోవచ్చున్నారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ నరసింహ, డా.ఇందిర, యాదగిరి, సుబ్రమణ్యం, మక్లా, విద్యాసాగర్ పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



లబ్దిదారులకు సిఎం సహాయనిధి చెక్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాలగీత తదితరులు

**ఉప్పల్; నవంబరు 14 ప్రభాతవార్త :** సిఎం సహాయనిధి నిరుపేదలకు ఒక వరంలాంటిదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు డివిజన్‌లకు చెందిన లబ్దిదారులకు కార్పొరేటర్లు బన్నాల గీత ప్రవీణ్, పన్నాల దేవేందర్‌రెడ్డి తదితరులతో కలిసి లబ్దిదారులకు చెక్‌లు అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిఎం సహాయనిధి కింద రూ.26లక్షల చెక్‌లను అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలు సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చెక్‌లు త్వరగా వచ్చేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ సీనియర్ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సాయిజెన్ శేఖర్, గంధం నాగేశ్వర్‌రావు, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ఉప్పల్ భగాయత్‌లో రూ.34లక్షలతో వీధిదీపాలు : రజితరెడ్డి**


జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

**ఉప్పల్; నవంబరు 14 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్ పరిధిలోని రూ.34లక్షల వ్యయంతో వీధిదీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో వీధిదీపాల నిర్వహణ సక్రమంగా లేదని, గతంలో హెచ్ఎండిఏ అధికారులు సైతం వీధిదీపాల నిర్వహణ గురించి పట్టించుకోలేదని కమిషనర్ దృష్టికి తీసుకుని వచ్చారు. వీధిదీపాలకు మరమ్మతులు చేయడంతోపాటు, ఎల్ఇడి లైట్లు ఏర్పాటు చరేయాలని, విరిగిన స్థంభాలను పునరుద్ధరించాలని, కేబుల్స్ మరమ్మతులు చేయాలని సూచించారు. దీనిపై సానుకూలంగా స్పందించి జోనల్ కమిషనర్ వెంటనే రూ.34లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. నిధులు విడుదల చేసిన కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

**స్వామి వివేకానంద్ యువక్ సంఘ్ కమిటి ఎన్నిక**

**ఉప్పల్; నవంబరు 14 ప్రభాతవార్త :** చిలుకానగర్ స్వామి వివేకానంద యువక్ సంఘ్ కమిటికి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు చిలుకానగర్‌లో జరిగిన సమావేశంలో కమిటి అధ్యక్షునిగా ఈరెల్లి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఇంద్రాల రమేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం పౌండర్స్ కటకం శ్రీకాంత్, ఠాకూర్ ఉమేష్‌సింగ్, కటకం సంజయ్, అడ్వయిజర్ ముక్కాల రామకృష్ణ, ముక్కాల హరికృష్ణ, జి.రాజు, చిలువేరు సత్యనారాయణ, డి.స్వామి, తుమ్మల పరమేష్, ఆలే నరేంద్ర, శరత్‌బాబు, లక్ష్మణ్, ప్రకాష్, నరేష్, అఖిల్, మహేష్, బోయ రమేష్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యపై కార్పొరేటర్‌కు వినతి


కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేకర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎర్రకుంట వాసులు

**నాచారం, నవంబర్ 14 ప్రభాతవార్త:** నాచారం డివిజన్ పరిధిలోని ఎర్రగుంట లాల్‌భహదూర్ శాస్త్రి సామాజిక భవనం పక్కరోడ్డులో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేకర్‌కు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. అందుకు కార్పొరేటర్ సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తానని వారికి హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు వాసుదేవరాజు, నవీన్, వేణు, రఘు,పూర్ణ చందర్, సాయిజన్ శేఖర్ పాల్గొన్నారు.